www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 15 జనవరి 2023

5

అన్నమయ్య

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్ట్ నరసింహులు మృతి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

సీనియర్ పాత్రికేయులు బొల్లు నరసింహులు(61) గుండె పోటుతో శనివారం మృతి చెందారు. ఆయన సుధీర్ఘకాలం పాటు ఆంధ్రప్రభ దినపత్రికలో పాత్రికేయులుగా పనిచేశారు. ఒంటిమిట్ట శ్రీకోదండ రామాలయం చైర్మన్‌గా కూడా ఆయన పనిచేశారు. ఇటీవల ఆయన గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. పాత్రికేయ వృత్తిని వదిలేసి ఇంటి వద్దే వ్యాపారం చేసుకుంటూ ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నరసింహులు పార్థివదేహాన్ని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, ఆయన తనయుడు విష్ణు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగలరాయుడు, రాజంపేట పార్లమెంట్ టిఎన్‌టియుసి నాయకులు ఉన్నం కిరణ్, మండల నాయకులు గజ్జలు నరసింహారెడ్డి, బొబ్బిలి నాయుడు, పలువురు జర్నలిస్టులు, స్థానికులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. నరసింహులు కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

ఆశాజనకం

ఆనందంలో వరి రైతులు
ఎకరాకు 30 నుంచి 40 బస్తాలు
బస్తా ధర రూ.1500కు పైనే..
కొనుగోలు కేంద్రాలవైపు చూడని రైతులు

పంట కోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ప్రజాశక్తి - చాపాడు

వరి పంట సాగు చేస్తే ఉరి వేసు కున్న ట్లే అన్న నానుడి రైతుల్లో అధికంగా వినివి స్తుం టుంది. అందుకు అనుగుణంగా సాగు కూడా జిల్లా వ్యాప్తంగా తగ్గుముఖం పట్టింది. అయితే సాగు అనంతరం పరిస్థితులు అందుకు భిన్నంగా మా రాయి. తెగుళ్ల బెడద తగ్గడం, దిగుబడి గతంలో ఎన్నడూ లేని విధంగా ఆశాజనకంగా ఉండడం, ఎలాంటి నిబంధనలు లేకుండానే వ్యాపారులు వద్దనే గిట్టుబాటు ధర అమలవుతుండడంతో రైతుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది. వరి ధాన్యం దిగుబడితో పాటు నాణ్యత కూడా ఆశా జనకంగా ఉందని రైతులు వ్యాపారులు పేర్కొం టున్నారు. కొనుగోలు కేంద్రాల్లో మాత్రం ఇంకా ఎక్కడా ఏర్పాటు చేయలేదు. దళారుల బెడద ఎక్కువగా ఉంది.

జిల్లాలో ఖరీఫ్‌లో వరి సాగు...

జిల్లాలో కెసి కెనాల్, కుందూ, పెన్నా, బ్రహ్మసాగర్, మైలవరం తదితర నీటి వనరుల ఆధా రంగా 1.10 లక్షల ఎకరాలలో వరి పంటను రైతు లు సాగు చేశారు. జిల్లాలోని మైదుకూరు, చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, బి.మఠం మండ లాల పరి ధిలో 53 వేల ఎకరాలలో సాగు చేశారు. మైలవరం, పెండ్లిమర్రి, ప్రొద్దుటూరు, వల్లూరు, వేంపల్లి, అట్లూరు, చెన్నూరు, చింతకొమ్మదిన్నె, గోపవరం, కలసపాడు, కోడూరు తదితర మం డలాల్లో అత్యధికంగా రైతులు వరి పంటను సాగు చేశారు. ఎకరాకు ప్రస్తుతం 2200 నుంచి 4 వేల కిలోల వరకు వరి ధాన్యం దిగుబడి వస్తో ంది. 32 నుంచి 42 బస్తాల వరకూ దిగు బడి వస్తోంది. వరి పంట సాగుకు రూ.30 నుంచి 35 వేల వరకు ఖర్చులు అవుతుంది. జిల్లాలో పది లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి అందు బాటులో ఉంది.

పంట కోత ప్రయోగాలు...

ఖరీఫ్‌లో సాగైన వరిలో పంట కోత ప్రయోగాన్ని వ్యవసాయ అధికారులు, ఎఎస్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది నిర్వహిస్తున్నారు. ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు ఆధారంగా కొంత మంది రైతులు పొలాలలో ఖరీఫ్ కు సంబంధించి పంటకోత ప్రయోగాలను చేపడుతున్నారు. ప్రస్తుతానికి చాపాడు మండల పరిధిలో 16 రెవిన్యూ గ్రామాలలో 64 మంది రైతులు పొలాలలో ఖరీఫ్‌కు సంబంధించి పంట కోత ప్రయోగాలను చేపట్టారు. ప్రతి ప్రయోగంలో 15 నుంచి 20 కిలోల దిగుబడి వస్తుందని అధికా రులు పేర్కొంటున్నారు. ఈ ప్రకారం ఎకరానికి 32 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందటున్నారు.

అమలవుతున్న గిట్టుబాటు ధర...

ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధరను ఏ గ్రేడ్ రకం క్వింటాలుకు రూ.1,960, బి గ్రేడ్‌కు రూ.1,940 చెల్లించనున్నారు. రైతులు మద్దతు ధర పొందాలంటే నాణ్యతా ప్రమాణాల్లో తేమ 17 శాతానికి మించి ఉండకూడదు. కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చే ధాన్యంలో తేమ శాతంతో పాటు, దుమ్ము, తాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని. వేస్టేజ్ ఒక శాతం కన్నా ఎక్కువగా ఉండకూడదు. మట్టిపెళ్ళలు, రాళ్ళు ఒక శాతం మించొద్దు. పాడైన రంగు మారిన, మొలకెత్తిన ధాన్యం 5 శాతంలోపే ఉండాలి. పూర్తిగా తయారు కానీ, ముడుచుకోపోయిన ధాన్యం 3 శాతానికి మించొద్దని అధికారుల నిబంధనలు ఉన్నాయి. పంట పోలాలలో ఎలాంటి నిబంధనలు లేకుండానే వ్యాపారులు గిట్టుబాటు ధర కంటే అధిక ధరలకు కొనుగోలు చేపడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల అవసరం లేకుండా పోయింది. కొనుగోలు కేంద్రాలు ఎక్కడా ప్రారంభం కాలేదు. రైతులు వాటి గురించి పట్టించుకోవడం లేదు.

వరి పంట దిగుబడి బాగుంది.

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట తెగుళ్ల బారిన పడకుండా ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 32 బస్తాలు తగ్గకుండా దిగుబడి వస్తున్నది. 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేశాను. ప్రస్తుతం పంట పోలాలలోనే బస్తా ధర రూ.1500 ఉండడంతో కాస్త ఊరటగా ఉంది.

- రామ్మోహన్, కౌలు రైతు, మైదుకూరు.

గత ఏడాది కంటే మెరుగైన దిగుబడి.

వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నది గత ఏడాది కంటే రెట్టింపుగా దిగుబడి వచ్చినది. నాలుగు ఎకరాలలో వరి పంట సాగు చేపట్టాను. ఎకరాకు 34 బస్తాల ప్రకారం దిగుబడి వచ్చినది. ధాన్యాన్ని నిల్వ ఉంచేందుకు ఏర్పాట్లు చేపడు తున్నాం. వరి పంటకు గిట్టుబాటు ధర ఈ ఏడాది అమలు అవుతుంది.

- రామ చంద్రారెడ్డి, రైతు, చియ్యపాడు, చాపాడు.

పంట దిగుబడి ఆశాజనకం

చాపాడు మండల పరిధిలో 15 వేల ఎకరాలలో వరి పంట సాగైనది. ఇప్పటికే 70 శాతం పంట నూర్పిడి పూర్తయింది. పంటకోత ప్రయో గాలు కూడా చాలా వరకు పూర్తయ్యాయి. 15కిలోల నుంచి 20 కిలోల వరకు దిగుబడి వస్తున్నది. పెద్ద గురువలూరు ప్రాంతంలో అధిక దిగుబడి వచ్చినది. రైతులు మార్కెట్ లో గిట్టుబాటు ధర ఉండడంతో రైతు భరోసా కేంద్రాల వద్దకు రావడం లేదు.

- మ్యాగీ, వ్యవసాయాధికారి, చాపాడు.

తీవ్రంగా గాయపడిన పావని, అభితేజరెడ్డి

ఆత్మహత్య చేసుకున్న నరసింహారెడ్డి

దారుణం

కొడుకు, కూతురిపై గొడ్డలితో దాడి అనంతరం ఆత్మహత్యచేసుకున్న తండ్రి
తండ్రి మృతి, కొన ఊపిరితో పిల్లలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చిన్నప్పటి నుంచి అల్లారు ముద్దుగా పెంచుకున్న తన పిల్లల్ని కసాయి తండ్రి కర్కశ్యంగా అత్యంత దారుణంగా గొడ్డలితో దాడి చేశాడు. తరువాత తానూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ప్రొద్దుటూరు మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు... నక్కలదిన్నె గ్రామానికి చెందిన బసిరెడ్డి నరసింహారెడ్డి (47)పురుగుల మందు ఏజెన్సీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగలేక ఇంటి వద్దే ఉండేవాడు. అతనికి కుమార్తె పావని, కుమారుడు అభితేజరెడ్డి ఉన్నారు. వీరిలో కుమార్తె 9వ తరగతి, కుమా రుడు 10వ తరగతి చదువుతున్నారు. శు క్రవారం రాత్రి కొడుకు, కుమార్తెతో కలసి హాలులో పడుకున్నాడు. అతని భార్య మరో గదిలో పడు కుంది. ఆమె నిద్రిస్తున్న సమ యంలో గదికి బయట నుంచి గడియపెట్టాడు. 11-12 గంటల సమయంలో పిల్లలిద్దరూ నిద్రిస్తుండగా గొడ్డలితో అత్యంత దారుణంగా నరికాడు. వెంటనే అతనూ వంటింట్లోకి వెళ్లి రెండు డబ్బాల పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెడ్‌రూమ్‌లో ఉన్న భార్య కేకలు విని చుట్టుపక్కల వారు వచ్చి గది గడియ తీశారు. హాలులో ఇద్దరు పిల్లలు రక్తపు మడుగులో పడి ఉండడం చూసి ఆమె దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న ముగ్గురిని స్థాని కులు ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే నరసిం హారెడ్డి మృతిచెందాడు. పిల్లల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కొడుకు, కుమార్తెలను కిరా తంగా చంపి, తాను ఆత్మచేసుకోవడానికి గల కారణాలు పూర్తిగా తెలి యలేదు. ఇదీలా ఉండగా మృతుడు అనారోగ్యం కారణంగా ఐదేళ్లుగా ఏపని చేయకుండా ఇంట్లో ఖాళీగా ఉండేవాడని, అతని మానసిక పరిస్థితి కూడా బాగాలేదని స్థానికులు పేర్కొంటున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనలో నక్కదిన్నె గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భోగి మంటల్లో చీకటి ఉత్తర్వులు

రాయచోటి : జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒ నంబర్-1 ప్రతులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో వేసిన భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం టిడిపి రాయచోటి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు ప్రతులను దగ్ధం చేశామన్నారు. వైసిపి నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజావేదిక కూల్చడంతో జగన్మోహన్‌రెడ్డి విధ్వాంశక పరిపాలన ప్రారంభమైందన్నారు పిచ్చి తుగ్లక్ విధానాలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. అభివృద్ధి సంక్షేమం తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగాయన్నారు. కేవలం మాయమాటలతో పత్రిక ప్రకటనలతో జగన్మోహన్ రెడ్డి మాయాల పకీరుగా మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంబేపల్లి మండల అధ్యక్షుడు రెడ్డయ్య యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు తాహిర్, రమణ, చందు, శ్రీనాథ్, వెంకటరమణ పాల్గొన్నారు.

నందలూరు: ఆంధ్ర రాష్ట్రంలో సైకో పాలన పోవాలని సైకిల్ పాలన రావాలని మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం భోగి పండుగ పురస్కరించుకొని జిఒ ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమాలు చేసే హక్కు మనకుందన్నారు. కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు, యువకులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మండలంలోని దప్పేపల్లెలో జిఒ ప్రతులను దగ్ధం చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న, జిల్లా నాయకులు స్వరూప్ తేజ, అనిల్, చంద్రశేఖర్, అక్షయ్, అరుణ్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న చీకటి జీవో నెంబర్ -1ని వెంటనే రద్దు చేయాలంటూ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆ పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. జిఒ కాపీలను, సైకో దిష్టిబొమ్మను భోగి మంటల్లో కాల్చి సైకో పోవాలి సైకిల్ రావాలి అనే నినాదంతో ప్లకార్డులను పట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కోడూరు మండల పార్టీ అధ్యక్షులు కొమ్మ శివ, మాజీ ఉపసర్పంచ్ నార్జాల హేమరాజ్ మాజీ జడ్‌టిసి నాయుడోరి రమణ, రాజంపేట పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షులు పులెల రమేష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు హస్తి సుప్రజ, రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కటికం సునీత, యువ నాయకులు పోతురాజు నవీన్, పోకల మని, రాజంపేట పార్లమెంట్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు తేనెపల్లి చిన్న, హస్తి చంద్రరాజు, మైనారిటీ నాయకులు కరీముల్లా, వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బుంగటావల రాజశేఖర్, చంద్రమౌళి, మండలం ఐటిడిపి ఛాంపియన్ ఒలిమికుమార్ రామయ్య, కైలాసాని శీను పాల్గొన్నారు.

కోడూరు : ప్రభుత్వ దిష్టిబొమ్మ, జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న టిడిపి నాయకులు

పండగ పూట విషాదం
రోడ్డు ప్రమాదంలో వధువు మృతి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి చెందడంతో పండుగ పూట రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. శనివారం గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అనురాధ మృతి చెందగా ఆమె భర్త చంద్రమౌళికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళితే.. స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రి వంక ప్రాంతంలో నివసిస్తున్న రామకృష్ణ కుమారుడుకి నెల రోజుల క్రితం కడపకు చెందిన అనురాధతో వివా హమైంది. శనివారం ఉదయం నూతన వధూవరులు సంక్రాంతి పండగకు ద్విచక్ర వాహనంలో కడపకు బయ లుదేరారు. గువ్వలచెరువు ఘాటులో ద్విచక్రవానాన్ని లారీ ఢీకొంది. ఈ ప్రమా దంలో అనురాధ అక్కడికక్కడే మృతి చెందారు. చంద్రమౌళికి కుడికాలు విరి గింది. స్థానికులు వెంటనే చంద్రమౌళిని వేలూరు ఆసుపత్రికి తరలించగా అనురాధను కడప రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనూరాధ మృతి, చంద్రమౌళికి గాయాలతో వారి రెండు కుటుంబాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆ కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. సంఘటనపై రామాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనురాధ, చంద్రమౌళి (ఫైల్‌ఫోటో)

క్రీడలతో మానసిక ఉల్లాసం

నందలూరు: క్రీడలు ఆడడం ద్వారా ఆత్మవిశ్వాసంతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని టిడిపి మహిళా విభాగం నేత మాడపూరి హేమలత అన్నారు. శనివారం మండల జడ్పీ క్రీడా మైదానంలో ప్రముఖ విద్యావేత్త, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చమర్తి జగన్‌మోహన్‌రాజు సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తోపాటు క్రీడాకారులకు మెమోంటోలను అందజేశారు. తెలుగుదేశం పార్టీ బిసి సెల్ స్టేట్ సెక్రటరీ సమ్మెట శివప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రీడా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా సంతోషకరమని పేర్కొన్నారుర. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలను చమర్తి జగన్‌మోహన్‌రాజు ద్వారా నిర్వహిస్తారని వారు ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో శ్రీ అన్నమాచార్య అకాడమీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ డైరెక్టర్లు ఏనుగుల బాలాంజనేయులు, సమ్మెట ఉమామహేష్, టిడిపి నాయకులు తోట శివశంకర్, కొండశెట్టి సుదర్శన్, ఆర్గనైజర్లు పల్లె గ్రీష్మంత్ రెడ్డి, మాడపూరి శ్రీరాములు, దొమ్మరాజు మోహన్ రాజు, లీలాకృష్ణయ్య, మహేష్, శివకోటి, మున్నా, హరికృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు మెమోంటోలు అందజేస్తున్న హేమలత

'ముస్లిములను వేధిస్తున్న ప్రభుత్వం'

ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

ముస్లిం మైనార్టీలపై వేధింపులే లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని ముస్లిం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పుంగనూరు నియోజకవర్గంలో రెండు రోజుల క్రితం ముస్లిం మైనార్టీ నాయకుల అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం పట్ల కలికిరిలో ముస్లిం మైనార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక అమర్నాథ్‌రెడ్డి భవనంలో టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనీఫ్ ఆధ్వర్యంలో అరెస్టయిన బాధితుల ఫోటోలు చేత పట్టుకొని తన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు గత ఎన్నికల్లో ఓట్లు వేసినందుకే వైసిపి అధికారంలోకి వచ్చిందని దాన్ని మరచి ఇప్పుడు మైనార్టీలపై వేధింపులే లక్ష్యంగా అక్రమంగా కేసులు బనాయించి అరెస్టులు చేస్తుందని, ఇలాంటివి మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మైనార్టీల అభివృద్ధి చేయడానికి చేతగాక వారిపై దాడులకు దిగుతుందని కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నదని విమర్శించారు. మంత్రి నియోజకవర్గంలో ఇలాంటి అన్యాయాలు, అక్రమాలు జరగడం పట్ల రాష్ట్ర ప్రజలంతా విసుగుపోతున్నారని పేర్కొన్నారు. దౌర్జన్య కాండను ప్రదర్శిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసిన ముస్లిం మైనార్టీ నాయకులను విడుదల చేయకపోతే సబ్ జైలు ఎదురుగా నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వంపై పోరును ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుండ్లూర్ సర్పంచ్ సైఫుల్ల, తెలుగుదేశం నాయకులు ముస్తఫా హజరత్, సనావుల్లా, సిరాజ్, మాజీ జెడ్పిటిసి మాలతి, భాస్కర్ రెడ్డి, వైజాగ్ భాష, జావీద్ సుభహాన్, జాకీర్, ఖాదరవల్లి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

16న పీలేరుకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-పీలేరు

కుప్పంలో చంద్రబాబుతో కిషోర్‌కుమార్‌రెడ్డి

ఈ నెల 16వ తేదీ సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పీలేరుకు రానున్నట్లు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ బాధ్యులు నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచెర్లలో ప్లెక్సీల వివాదంలో టిడిపి కార్యకర్తలపై అధికార పార్టీ అండదండలతో పోలీసులు అక్రమ కేసులు బనాయించి పీలేరు సబ్ జైలుకు తరలించిన విషయం విధితమే. ఈ క్రమంలో కార్యకర్తలను పరామర్శించడానికి చంద్రబాబు సోమవారం 12 గంటలకు పీలేరు సబ్ జైలుకు రానున్నట్లు చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా, రాజంపేట పార్లమెంట్, పీలేరు, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలకడ, కెవి పల్లి మండలాల టిడిపి నాయకులు, అనుబంధ సంఘాల కార్యకర్తలు, అభిమానులు రావాలని పిలుపునిచ్చారు.

17న నడింపల్లిలో కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని ఆర్.నడింపల్లి గ్రామంలో ఈ నెల 17న సాయంత్రం కబడ్డీ పోటీలు జరగనున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ సెక్రటరీ మంజునాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే టీంలు రూ.516 చెల్లించాలని తెలిపారు. పోటీలలో పాల్గొనే వారికి భోజన సదుపాయాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.15 వేలు, రెండవ బహుమతి రూ.7116, మూడవ బహుమతి 3116 అందచేయబడునని తెలిపారు.

విభిన్నప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండలంలోని వెలుగు ప్రత్యేక పాఠశాలలోని విభిన్నప్రతిభావంతులకు ఉచితంగా ఉపకరణాలను భారత ప్రభుత్వం ఆడిప్ స్కీం ఆధ్వర్యంలో అలింకో వారి సహకారంతో శనివారం పంపిణీ చేశారు. జిల్లా వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిషోర్, ఎమ్మెల్యే నవాజ్ భాషా, డిఎస్పీ కేశప్ప, అలింకో మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.రాజేష్ ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులకు వెలుగు మోహన్‌రెడ్డి, భాగ్యలక్ష్మి చేస్తున్న సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని సూచించారు. పండుగ రోజు ఇక్కడకు రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. 70 మంది విభిన్నప్రతిభావంతులు, వారి సహాయకులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో షణ్ముఖ ఆర్కెస్ట్రా యాంకర్ కరుణాకర్, వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి , వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపల్ పి.లీనాకుమారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, డిఎస్పి

విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

జాతీయ స్థాయిలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కురబలకోట

మదనపల్లె మిట్స్ కళాశాలలో బి.టెక్ మూడవ సంవత్సరం మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ పోటీలలో ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కడపలోని కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్‌లో కళాశాల విద్యార్థులు ప్రథమ బహుమతులు పొందినట్లు తెలిపారు. మూడవ సంవత్సరం చదువుతున్న ఆర్.మణికంఠ, సందీప్ కుమార్, మణి తేజ,షేక్ సమీర్ క్రాంక్ లీవెర్ మెకానిజంతో బహుళ ప్రయోజన స్ప్రే పరికరంకు ఈ బహుమతులు లభించిందని పేర్కొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, రూ.2 వేలు క్యాష్ ప్రైజ్‌ను అందజేశారన్నారు. దేశం నలుమూలల నుంచి ఎంతో మంది పోటీపడిన ఈ పోటీలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ ముప్పా లక్ష్మణ రావు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేసారు

కవి వెంకట రమణకు సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బద్వేలుకు చెందిన బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో రాజంపేటకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు, తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ సంక్రాంతి లక్ష్మికి స్వాగతం శుభ స్వాగతం అంటూ కవితను వినిపించారు. ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 10 మంది కవులు ఈ కవి సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షులు గంగసాని సాంబశివారెడ్డి, ప్రధాన కార్యదర్శి బలపనూరు శంభూప్రసాద్, డిప్యూటీ డిఎంహెచ్ఒ చంద్రహాస్ రెడ్డి తదితరుల చేతుల మీదుగా ఆయన పూలమాల, శాలువా, జ్ఞాపిక, నగదు పురస్కారాన్ని అందుకున్నారు.

పురస్కారం అందుకుంటున్న వెంకటరమణ

పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న కెకె.రెడ్డి

300 మంది పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల కేంద్రంలోని పెద్ద కారంపల్లి పంచాయతీలోని పేద ప్రజలను ఆదుకునేందుకు అమెరికా తెలుగు అసోసియేషన్, అమెరికా ఆటా ప్రోగ్రాం డైరెక్టర్ కె.కె.రెడ్డి పేద ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు హర్షనీయమని వైసిపి నాయకులు మదన్ మోహన్‌రెడ్డి, వీరబల్లి ఎంపిపి రాజేంద్ర రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు చిన్నపరెడ్డి, సుబ్రహ్మణ్యం రాజు అన్నారు. శనివారం భోగి పండుగ సందర్భంగా కెకె.రెడ్డి నివాసంలో పేద ప్రజలకు బట్టల పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు రంగనాథ్‌రెడ్డి, రాయలసీమ టూరిజం అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన రాజు, కుటుంబ సభ్యులు ఎం.వి.సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, డి.సుబోధ్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు కోదండ రెడ్డి, రఘునాథండ్డి, వెంకటసుబ్బయ్య, రిటైర్డ్ ఎంఇఒ మేడా చెంగల్ రెడ్డి, నరసింహ రాజు పాల్గొన్నారు.

మకర తోరణంతో సీతారాములు

ఆలయానికి మకర తోరణం వితరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరులో వెలసిన సీతారాముల ఆలయానికి అదే గ్రామానికి చెందిన సూరపరాజు సుబ్రహ్మణ్యం రాజు, నాగలక్ష్మి దంపతులు శనివారం మకర తోరణం బహుకరించారు. శనివారం భోగి పర్వదినం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దాత సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ పర్వదినాన రామయ్యకు మకర తోరణం బహూకరించే అవకాశం రావడం తన అదృష్టమన్నారు. కార్యక్రమంలో అయ్యపురాజు చంద్ర, శ్రీరామ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీనరసయ్య

షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు దగ్ధం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో శనివారం గువ్వల యల్లమ్మకు చెందిన రేకుల ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దహమైంది. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు. కుమారుడు జీవనోపాధి నిమిత్తం కువైట్ వెళ్లగా తల్లి, కుమార్తెలు సంక్రాంతి సందర్భంగా ఊరెల్లడంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని, పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు పేర్కొన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించగానే గ్రామస్తులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వగా అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలను ఆర్పారు. ఈలోపే ఫ్రిడ్జ్, టిడి, కుక్కర్, మంచం, పరుపు, వంట సామగ్రి, రూ.లక్ష నగదు, 4.50 గ్రాములు బంగారు కాలి బూడిదయిందని బాధితురాలు యల్లమ్మ బోరున విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ శాఖ వెంటనే స్పందించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, వీఆర్వో వెంకటేశ్వర్లు స్వామి, సర్పంచ్ ఈశ్వరయ్య, వెంకటయ్య 25 కిలోల బియ్యం, రూ.2 వేలు నగదు తక్షణ సాయంగా బాధితురాలికి అందజేశారు.

మాజీ సర్పంచ్ ఆర్థిక సాయం : అగ్ని ప్రమాదం సంబంధించినట్లు సమాచారం తెలుసుకున్న ఊటుకూరు మాజీ సర్పంచ్ మన్నేరు లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని పరామర్శించారు. ఆర్థిక సాయంగా రూ.5 వేలు నగదును బాధితురాలికి అందజేశారు. విద్యుత్తు, గ్యాస్ వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని., అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ప్రతి ఒక్కరు జాగరూకతతో వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు సూచించారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ ఫాతిమా తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ గతంలో కోడి పందేలలో పట్టుబడిన 70 మందిని ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. బైండోవర్ చేసిన వ్యక్తులు పోలీసుల అనుమతి లేకుండా మండలం దాటి వెళ్ళరాదని పేర్కొన్నారు. రెండు రోజులుగా మండల సరిహద్దుల్లో కోడి పందేలను నిర్వహించే స్థావరాలను గుర్తించి, నిఘాను ఉంచామన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని అనంతపురం వడ్డేపల్లిలో వారం రోజుల క్రితం ప్రారంభించిన గంగమ్మ క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. ఈ కార్యక్రమంలో రామాపురం మండలం గంగనేరు టీంకు విన్నర్, అనంతపురం వడ్డేపల్లి జూనియర్ రన్నర్ టీంకు ద్వితీయ బహుమతులు రాయచోటి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ ప్రతి పల్లెలోనూ జరుగుతుందని తెలిపారు. యువత క్రికెట్ పైన ఎక్కువ మక్కువ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి మాజీ సర్పంచ్ రామక్రిష్ణ, ప్రసాద్, వేమయ్య పాల్గొన్నారు.

విన్నర్‌కు మెమెంటో అందజేస్తున్న రమేష్ కుమార్‌రెడ్డి

కనుమరుగవుతున్న మల్బరీ సాగు

- ప్రత్యామ్నాయ పంటలపై మక్కువ చూపిస్తున్న రైతులు
- ఇటు రైతులకు, అటు రీలర్లకు నష్టాలే
- దారుణంగా మారిన డీలర్ల పరిస్థితి

సాగులో ఉన్న మల్బరీ పంట

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

దేశవ్యాప్తంగానే కాదు ప్రపంచంలోనే ఇటు పంటలు కాని అటు వస్తువుల ధరలు కాని విపరీతంగా పెరుగుతున్నాయి. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మక్కువ చూపిస్తున్నారు. గతంలో మదనపల్లె డివిజన్‌లోని పుంగనూరు, రామసముద్రం, పలమనేరు, కుప్పం, వి.కోట, తంబళ్ళపల్లి, ములకలచెరువు, చౌడేపల్లి, సోమల, సదుం, కలికిరి, పీలేరు తదితర ప్రాంతాలలో మల్బరీ సాగు విపరీతంగా ఉండేది. ఎనిమిదేళ్ల క్రితం మదనపల్లె పట్టుగూళ్ళ మార్కెట్‌కు టన్నుల పట్టుగూళ్ళ వస్తుండేవి. అయితే ఇప్పుడు మరీ దారుణంగా కిలోలకే పరిమితమైయిందంటే మల్బరీ సాగు చేసే రైతులు పూర్తిగా తగ్గిపోయారు. మల్బరీసాగు చేసే రైతన్నలు నష్టాలు చవిచూడలేక మల్బరీ సాగు చేయడం మానేసి, టమోటా పంటపై రైతున్నలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. రాష్ట్రంలో మదనపల్లె, పలమనేరు, కుప్పం, కదిరి, ధర్మవరం, హిందూపురం, విజయవాడ పక్కన హనుమాన్ జంక్షన్‌లో పట్టుగూళ్ల మార్కెట్‌లు ఉన్నాయి. హిందూపురంలో అత్యధికంగా మార్కెట్‌కు పట్టుగూళ్లు వస్తాయి. ఆతర్వాత మదనపల్లె మార్కెట్‌కు వస్తాయి. మదనపల్లె మార్కెట్‌కు చిత్తూరు, నెల్లూరు, కడప, జిల్లాల నుండే కాకుండా తమిళనాడు రాష్ట్రం వేలూరు నుండి, కర్ణాటకరాష్ట్రం కోలార్‌జిల్లాల నుండి పట్టుగూళ్లను మార్కెట్‌కు రైతులు తీసుకువస్తున్నారు. గతంలో మదనపల్లె మార్కెట్‌కు రెండు టన్నులకు పైగా వచ్చిన పట్టుగూళ్లు నేడు వందల కిలోలకు పడిపోయింది. దీనికి కారణాలు అనేకం ఉన్నాయి. మల్బరీ సాగు చేసే రైతన్నలను ప్రభుత్వం విస్మరించడం. వారిని ఏవిధంగాను ఆదుకోకపోవడం, పట్టుగూళ్లకు కనీసం మద్దతు ధరలను కల్పించడంలోను ప్రభుత్వ వైఫల్యం అయిందని రైతులు ఆరోపిస్తున్నారు.

రీలర్ల పరిస్థితి దారుణం

పట్టుగూళ్లను మార్కెట్‌లో కొని వాటిని ఫ్యాక్టరీలకు తరలించి తరువాత విక్రయించే రీలర్ల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంటుంది. రెండురకాల పట్టుగూళ్ళు ఉన్నాయి. సిఎస్‌ఆర్, సిబి పట్టుగూళ్ళు మామూలుగా నాణ్యత కల్గిన పట్టుగూళ్లలో సిఎస్‌ఆర్ (తెల్లపట్టుగూళ్ళు) 6-7 కిలోల నుండి ఒక కిలో సిల్క్‌దారం వస్తుంది. సిబి(పసుపు పట్టుగూళ్లలో 7-8 కిలోల నుండి ఒక కిలో సిల్కు దారం వస్తుంది. ప్రస్తుతం నాణ్యమైన పట్టుగూళ్లు రాకపోవడంతో 8కిలోలపైగా పట్టుగూళ్లను వాడితేనే కిలో సిల్క్‌దారం వస్తుంది. దీనికి కూలీ, రవాణా ఖర్చులను కలిపితే కిలో రూ.3200 పైగా అవుతుంది. ప్రస్తుతం సిల్క్‌దారం కిలో విలువ ప్రస్తుతం రూ.3 వేలు ఉంది. రీలర్లు కూడా నష్టాల బాటలోనే నడుస్తున్నారు. నాణ్యతకల్గిన పట్టుగూళ్లు వస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని రీలర్లు తెలుపుతున్నారు.

చేనేతలకు కష్టమే

సిల్క్‌దారం విలువ రూ.3వేలకుపైగానే ఉండటంతో చేనేతకార్మికులకు నష్టాలు తప్పడం లేదు. పట్టుచీరలకు వర్కింగ్, లేబర్ ఎక్కువగా ఉండటం చీరల ధరలు పడిపోవడంతో వారు కూడా నష్టాలబాటలోనే నడుస్తున్నారు. మల్బరీని సాగుచేసే రైతులు, పట్టుపరిశ్రమ అధికారులు, కార్మికులు, రీలర్లు, చేనేతకార్మికులు ఇలా రాష్ట్రంలో ఎన్నో లక్షలమంది ఈపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి దానిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకుండా వారిని ఆదుకోనేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని పలువురు కోరుతున్నారు.

పట్టుగూళ్ల కొనుగోలు కేంద్రం

సంక్రాంతి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని కోసవారిపల్లెలో శనివారం శ్రీజ మిల్క్ డైరీ ఆధ్వర్యంలో మహిళలకు భోగి, సంక్రాంతి పండుగలు సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 25 మంది మహిళలు ఈ ముగ్గుల పోటీలలో రకరకాల ముగ్గులు వేశారు. మొదటి, రెండు, మూడు బహుమతులను ఎంపికైన మహిళలు శ్రీజ డైరీ చైర్‌పర్సన్ శ్రీదేవి చేతుల మీదుగా చీరలు బహుమతులుగా పంపిణీ చేశారు. పోటీలలో పాల్గొన్న మహిళలకు అందరికీ కన్సోలేషన్ బహుమతులుగా 200 ఎంఎల్ శ్రీజ నెయ్యి డబ్బాలో పంపిణీ చేశారు. సంక్రాంతి పండుగ సంప్రదాయాలకు నిలువైన ఈ పండుగలను మహిళలు జరుపుకుని ఆనందాన్ని పంచుకోవడం విశేషమన్నారు. కార్యక్రమంలో డైరీ డిగ్నిటీ మేనేజర్ గంగయ్య, సూపర్వైజర్ బాలకృష్ణ, నరేష్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** శ్రీజ మహిళా మిల్క్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కోటావూరులో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీజ కంపెనీ కురబలకోట ఏరియా ఆఫీసర్ మల్లికార్జున, కంపెనీ ఉద్యోగులు, మహిళలు, పాడి రైతులు పాల్గొన్నారు. **కలికిరి:** శ్రీజ కంపెనీ ఆధ్వర్యంలో పాల సేకరణ కేంద్రంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు నిర్వహించినట్లు ఏరియా మేనేజర్ నారాయణరెడ్డి తెలిపారు. పాతమంచూరు పాల సేకరణ కేంద్రంలో సిఎంఆర్ షాపింగ్ మాల్ వారి సహకారతో పాల కంపెనీ ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీజ పాల కంపెనీ మాజీ చైర్‌పర్సన్ బి.లావణ్యకుమారి, ఏరియా మనేజర్ నారాయణరెడ్డి, సూపర్వేజర్ పవన్ కుమర్, రాంకుమార్ హాజరయ్యారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని తన సొంత గ్రామం తిప్పాయిపల్లిలో బాహుబలి, పటాస్, లోఫర్ సహా కథానాయకుడు చరణ్ దీప్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రధాన చేశారు. కన్నడ, మలయాళం భాషలలో ఎక్కువ సినిమాలు చేశానని తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్కిల్‌లో శనివారం మేడా కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ముగ్గుల పోటీలలో వంద మంది మహిళలు పాల్గొని రకరకాల రంగువల్లులను వేశారు. ఈ పోటీలను పరిశీలించేందుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మేడ మల్లికార్జునరెడ్డి, ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు. మహిళలకు మ్యూజికల్ చైర్స్ పోటీలను ఏర్పాటు చేశారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులను, పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే, ఎంపీపీ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గడికోట ఉషారాణి, వర్ఫ్ బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు కలీం, వైస్ ఎంపీపీలు తుమ్మల భావన, అనుదీప్, వైసీపీ నాయకులు గడికోట సుబ్బారెడ్డి, హిమగిరి నాథ్ యాదవ్, నడివీధి సుధాకర్, రాజంపేట రూరల్ సిఐ పుల్లయ్య, నందలూరు ఎస్ఐ మైనుద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - మైదుకూరు

స్థానిక ఆర్ టిసి బస్టాండ్ ప్రవేశ ద్వారం శనివారం అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఈనెల 4న 'ప్రజాశక్తి' దినపత్రికలో 'గుంతల రోడ్డు బాగు చేయ రూ..!' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన మైదుకూరు ఆర్‌టిసి డిపో మేనేజర్ రోడ్డు గుంతలను పూడ్పిం చారు. ఈ సందర్భంగా స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు వెదురూరులో బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - చాపాడు

సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని వెదురూరు పార్వతీ దేవి సమేత సంగమేశ్వర దేవస్థాన ఆవరణలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పోటీలో విజేతగా నిలిచిన వృషభరాజముల యజమానులకు మొదటి బహుమతిగా రూ.1,00,116, రెండవ బహుమతిగా రూ.70,116, 3వ బహుమతిగా రూ.40,116, నాలుగో బహుమతిగా రూ.20,116, 5వ బహు మతిగా రూ.10,116 అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నరహరిపురంలో..

మండలంలోని నరహరిపురం గ్రామంలో సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మకర సంక్రాంతి మహోత్సవంలో భాగంగా జాతీయస్థాయి సీనియర్ వృషభ రాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.1,10,116, ద్వితీయ బహుమతిగా రూ.75,016, తృతీయ బహుమతిగా రూ.40,016, నాల్గవ బహుమతిగా రూ.20,016, ఐదో బహుమతిగా రూ.10,016 అందజేయనున్నట్లు వివరించారు. అలాగే బండలాగుడు పోటీల సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా భోగి సంబరాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సంక్రాంతి పండుగలో భాగంగా శనివారం భోగి పండుగలను ప్రజలు ఎంతో ఉల్లాసంగా, సతోషంగా జరుపుకన్నారు. ఈ సందర్భంగా శనివారం తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. పిల్లలు, పెద్దలు తమ ఇళ్ల ముందు భోగి మంటలు వేసి పండుగ సంప్రదాయాన్ని కొనిసాగించారు. చిన్న పిల్లలకు రేగి పండ్లు తలమీద వేసి ఆశీర్వదించారు. పలుచోట్ల మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

మహిళను కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - మైలవరం

ఆత్మహత్య చేసుకోబోతున్న మహిళను మైలవరం పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళితే.. జమ్ములమడుగు మండలం మొరగుడి గ్రామానికి చెందిన కంభం ఆదిలక్ష్మి కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకునేందుకు మైలవరం జలాశయం వద్దకు చేరుకుందని, అటుగా వెళుతున్న ఆటో డ్రైవర్ టి.వెంకటయ్య అనుమానించి ఎస్ఐ రామకృష్ణకు సమాచారమిచ్చాడు. గుర్రప్ప కోనకు ఎలా వెళ్లాలని ఆదిలక్ష్మి అడగడంతో వెంకటసుబ్బయ్య ఇటు కాదని కోనకు వెళ్లే దారని చూపించాడు. అయినా ఆదిలక్ష్మి జలాశయం వైపు వెళ్తుండటంతో డ్రైవర్ అనుమానించాడు. ఎస్ఐ తన సిబ్బందితో ఆదిలక్ష్మిని సురక్షితంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవాలనే ఆదిలక్ష్మికి, కుటుంబ సభ్యులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన ఎస్ఐ రామకృష్ణను, సిబ్బందిని, ఆటో డ్రైవర్ వెంకటసుబ్బయ్యను ఎస్‌పి అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించి, రివార్డును ప్రకటించారు. ప్రజల్లో పోలీస్‌శాఖపై ఉన్న నమ్మకం, గౌరవం పెరిగింది. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని ఆయన ఆకాంక్షించారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని నేలటూరు గ్రామంలో సంక్రాంతి సంబరాలను శ్రీకృష్ణ యాదవ సేవా సమితి కువైట్ ఎన్నారై వారి సహకారంతో కెఎస్‌ఆర్ హరిత ఫౌండేషన్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు పరుగు పందెం, ఖోఖో, మ్యూజికల్ చైర్, తాడు లాగే ఆట, ఫ్రాగ్ జంప్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు పి.రవీంద్రారెడ్డి, శారదమ్మ, ఎఎస్ఐ ఎం.శ్రీనివాసులు, ఉపసర్పంచు టి.సుకన్య, కెఎస్‌ఆర్ హరిత ఫౌండేషన్ ట్రెజరర్ కదిరి హరిత, చైర్మన్ సంజీవరాయుడు యాదవ్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

స్టార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - మైదుకూరు

సంక్రాంతి సంబరాల సందర్భంగా స్టార్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలను స్థానిక జడ్‌పి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 12 నుండి 13వ తేదీ వరకు పోటీలు నిర్వహించామన్నారు. వాలీబాల్‌లో మొదటి బహుమతి దువ్వూరు టీం, రెండవ బహుమతి నెలటూరు టీం గెలుచు కుందన్నారు. మొదటి బహు మతిగా రూ.10,000 సింగవరం సురేష్, సింగవరం సునీల్ బహూకరించారు. రెండవ బహుమతిగా రూ.5,000 మధుసూదన్ శర్మ బహుకరించారు. కబడ్డీ పోటీలో మొదటి బహుమతిని వెంకీ ఈగల్స్, రెండవ బహుమతి శ్రీరామ్‌నగర్ యూత్ అందుకుంది. మొదటి బహుమతి రూ.10,000 మూలే భరత్ కుమార్ రెడ్డి అందజేశారు. రెండవ బహుమతి రూ.5,000 మాచునూరు సుధీర్‌కుమార్ బహుకరించారు. ఈ పోటీలు దిగ్విజయంగా జరగడానికి ఎంఆర్‌ఎఫ్ సుబ్బయ్య, గవ్వల సుబ్బయ్య సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టార్స్ అసోసియేషన్ సభ్యులు గవ్వల సందీప్, పసుపులేటి కొండయ్య, ఆకుల చందు, దండు నారమ్మ గారి వెంకటసురేష్, హుస్సేన్, అబీద్, సాయి, సైఫ్‌ఉద్దీన్, భైరవస్వామి పాల్గొన్నారు.

కనిపించని పౌర సమాచార బోర్డు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

సెక్షన్ 5(1), (2) ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అథారిటీ పేర్లు, హోదా, ఫోన్‌నంబర్లు, ఇ-మెయిల్, కార్యాలయ చిరునామాతో స్థానిక భాషలో ప్రజలకు బోర్డులు కనబడేలా ప్రభుత్వ కార్యాలయం బయట ఏర్పాటు చేయాలి. అయితే ఎర్రగుంట్ల నగర పంచాయతీ కార్యాలయంలో ఎలాంటి సమాచార బోర్డుల్లేకపోవడం గమనార్హం. చట్టాలు అమలు చేయాల్సిన అధికారులే పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సమాచారం అడుగుటకు భారత దేశంలోని ప్రతి పౌరుడికి హక్కు ఉంటుందని, అడిగిన సమాచారం ఇవ్వడంతోపాటు సమాచార పత్రం కార్యాలయంలో ఎవరికి అందించాలనే విషయం కూడా ప్రజలకు తెలియజేసే బాధ్యత కార్యాలయ అధికారులదేనని పలువురు పేర్కొంటున్నారు. పౌర సమాచారానికి సంబంధించిన బోర్డులను కార్యాలయం వద్ద ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న రమేష్‌రెడ్డి, ప్రసాద్‌బాబు

మెగా వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్ చెరువు గ్రామం కరిమిరెడ్డిగారిపల్లెలో కీ.శే. కరిమిరెడ్డి బొజ్జమ్మ జ్ఞాపకార్థకం జిల్లా స్థాయి మెగా వాలీబాల్ టోర్నమెంట్ శనివారం టిడిపి నాయకులు సుగబాసి ప్రసాద్‌బాబు, మాజీ ఎంఎల్ఎ రమేష్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య స్కూల్స్ ఎజిఎం రమణ, మాజీ ఎంపిపి వెంకటనారాయణరెడ్డి, సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, కుమార్ నాయుడు, పార్థసారథి రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్షుమయ్య, మాజీ సర్పంచులు బి.కె.ఎం.రియాజ్, ప్రభాకర్ నాయుడు, చిన్నపరెడ్డి, బద్రప్ప నాయుడు,రెడ్డప్పరెడ్డి, టిడిపి నాయకులు బాషా, జకీర్,రెడ్డి ప్రసాద్, రమేష్ బాబు, శివప్ప నాయుడు, రామచంద్రారెడ్డి, రాఘవ, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-రామాపురం

విభిన్న ప్రతిభావంతులు ఒకొక్కరికి రూ. 300 చొప్పున ఆరు నెలలపాటు 12 మందికి రాయచోటి కంటి వైద్య నిపుణులు రెడ్డన్న ఆర్థిక సాయం చేశారు. మండలంలోని మేదరపల్లి రామాపురం ఉడుము వారి పల్లి చెందిన విభిన్న ప్రతిభావంతులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ మేద రపల్లి, సరస్వతిపల్లి పంచాయతీలోని ఉడుమువారిపల్లి. గ్రామాల చెందిన విభిన్న ప్రతిభావంతులకు తన వంతుగా అందజేసినట్లు తెలిపారు. అంగవైకల్యంతో ఏ పని చేయలేని వారు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వారిని గుర్తించి కనీస అవసరాలు కైనా ఉపయోగపడేలా కొంత నగదును ప్రతినెలా ఐదో తారీకు లోపు వారి ఇంటికి వచ్చి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వంగిమల రంగారెడ్డి, మర్రి సుమిత్ర, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

విజేతలకు మెమొంటో అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

క్రీడల్లో గెలుపోటములు సమానమే

ప్రజాశక్తి-రామాపురం

క్రీడల్లో గెలుపు ఓటములు సమానమేనని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాచపల్లి గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం ఫైనల్ మ్యాచ్ లో గెలుపొందిన వారికి సీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ధృఢత్వంతోపాటు మాన సికంగా ఉల్లాసంగా ఉంటారని చెప్పారు. విజేతగా వడ్డేపల్లి, రన్నర్‌గా నల్లగు ట్టపల్లె నిలిచాయి. కార్యక్రమంలో వైసిపి నాయకులు సర్పంచ్ వెంకటరెడ్డి, పెద్దిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, పోస్ట్ వెంకట్రాజు, చలామరెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని బి.కొత్తకోట పోలీసులు సూచించారు. ఎస్ఐ రామ్మోహన్ ఆదేశాల మేరకు శనివారం హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. హెల్మెట్ లేని వాహనదారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రికార్డుల సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. తద్వారా వారి ప్రాణాలకు రక్షణ పొందవచ్చునన్నారు. వాహనదారులు సక్రమంగా రికార్డులు కలిగి ఉండాలన్నారు. రికార్డు లేని వాహనాలకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలన్నారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గౌడ్, కానిస్టేబుల్స్ నరసింహులు, శేఖర్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

-పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిమాచల్‌ప్రదేశ్‌లో ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిందన్నారు.1.36 లక్షల మంది ఉద్యోగులకు, విశ్రాంతి ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రతి ఏడాది రూ.900కోట్లు అదనంగా ఆర్థిక భారం పడుతుందన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, కాంగ్రెస్ మిత్రపక్షంగా ఉన్న జార్ఖండ్ ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే నిర్ణయాన్ని తీసుకోవడం హర్షణీయమన్నారు. ఎపిలో వైసిపి ప్రభుత్వ ఉద్యోగులను, విశ్రాంతి ఉద్యోగులను దారుణంగా నమ్మించి మోసగించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయగా ఎపి ప్రభుత్వానికీ ఎందుకు సాధ్యం కాదని తులసిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలైన వైసిపి, జనసేన, టిడిపి బూతుల పార్టీలుగా తయారు కావడం శోచనీయమని అన్నారు. ముందుగా భోగి మంటల్లో జిఒ వన్ ప్రతులను కార్యకర్తలతో కలిసి దగ్ధం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, ఉత్తన్న, బీగాల రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, శివ, వెంకటేష్, బద్రీ, రాఘవయ్య, చెన్నకేశవ పాల్గొన్నారు.

వృక్షాలు మానవ మనుగడకు సోపానాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వృక్షాలు మనిషి మనుగడకు సోపా నాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బాధ్యతగా పెంచాలని పూర్వపు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పేర్కొన్నారని ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ చిత్రకారిణి ప్రసన్న తెలిపారు. 'సేవ్‌ట్రీస్' ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రసన్న శనివారం వెంకయ్యనాయుడును తన నివాస భవనంలో తను చిత్రించిన బొమ్మను బహూకరించారు. ఈ సందర్భంగా ప్రసన్న స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో సేవ్‌గర్ల్‌చైల్డ్ ప్రాజెక్ట్ అధినేత తుపాలకు రామాంజనేయరెడ్డి, సభ్యులు నారాయణ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించరూ..!

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక అగ్రహారంలోని అంగన్వాడీ కేంద్ర భవనానికి ప్రహరీ లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంగన్వాడీ కేంద్రం చుట్టూ కంపచెట్లు, చెత్తచెదారం పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో విష పురుగులు అధికంగా ఉన్నాయి. చిన్నారులను అంగన్వాడీ కేంద్రానికి పంపాలంటే భయంగా ఉందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అంగ న్వాడీ కేంద్రం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ప్రహరీకి నోచు కోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల పశువులు సైతం అంగన్వాడీ కేంద్ర భవనంలోకి వచ్చి పరిసరాలను అపరిశుభ్రంగా మారుస్తున్నాయి. ప్రహరీ నిర్మించాలని పలుమార్లు స్థానికులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.